క్లుప్తంగా

టి.పుత్తూరులో ప్రచార రథం


టి.పుత్తూరులో సీతారామలక్ష్మణులకు అభిషేకం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

తవణంపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ ధర్మాదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్, కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం సంయుక్తంగా చేపట్టిన ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రచార రథం మండలంలోని టి.పుత్తూరుకు చేరుకుంది. టి.పుత్తూరులోని కోదండరామ స్వామి దేవస్థానంలో సీతారామలక్ష్మణులకు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తితో స్వామికి సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మొగిలిలో..


ధర్మప్రచార రథంలో వినాయక స్వామి

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో ఆదివారం సాయంత్రం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ధర్మప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మొగిలికి చేరుకున్న వినాయక స్వామి ధర్మప్రచార రథానికి మొగిలి శివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భజన బృంద కళాకారులు స్వాగతం పలికారు. ధర్మప్రచార రథంలోని వినాయకస్వామి వారికి గ్రామస్తులు పూజలు నిర్వహించి, కర్పూర హారతులు సమర్పించారు.

ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి

చిత్తూరు రూరల్: నగరంలోని బజారువీధిలో ఆదివారం విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భగవాన్‌ను దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊరేగించారు.

వీణా గణపతి రంగుల చిత్రం


జలవర్ణ చిత్రం వీణా గణపతి

యాదమరి: వినాయక చవితి సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి జలవర్ణ చిత్రాన్ని చిత్రీకరించారు. చవితి రోజు భక్తులు స్వామివారిని దర్శించుకుంటూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు అభయ గణేశుడు స్వామిని హృదయ వికాసము నొంది, భక్త కోటి కష్టాలు తొలగిపోయి జీవితం వీణానాదంలా సుఖమయం కాగలదని చాటిచెప్పే చిత్రాన్ని అద్భుతంగా గీశారు.

క్యూల పరిశీలనలో ఏఎస్పీ


ఆలయ క్యూలను పరిశీలిస్తున్న ఏఎస్పీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలను ఏఎస్పీ సుధాకర్ పరిశీలించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుతో కలసి పోలీసు సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి చవితిరోజు కాణిపాకంలో నిర్వహించాల్సిన బందోబస్తుపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

పలమనేరు: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడి మట్టితో ఓ మొక్కను నాటాలని పలమనేరు ప్రకృతి ప్రేమికుడు మల్లిచెట్ల దేవేంద్ర విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఆదివారం ఆయన దీనిపై అవగాహన కల్పించారు. వినాయకుడి మట్టితో మొక్కలను పెంచిన వారికి మరో విలువైన మొక్కను బహుమతిగా ఇస్తామన్నారు.

కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్చిలు, ఆలయంలో పుష్పాలంకరణలో నిమగ్నమైన సిబ్బంది







ఊరూరా చవితి సందడి

- వాడవాడలా వెలసిన మండపాలు
- జోరుగా పూజా సామగ్రి అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా ఊరూరా చవితి సందడి నెలకొంది. వాడవాడలా సర్వం సిద్ధమైంది. గణనాథులు సోమవారం వీధి వీధినా కొలువుదీర్చనున్నారు. ఏర్పాట్లను భారీగా పూర్తి చేశారు. వినాయకుని కొలువుదీర్చే పనుల్లో బిజీగా కనిపించారు. అమ్మకాలు, కొనుగోలు జోరందుకున్నాయి. ప్రధాన కూడళ్ల జనంతో కిటకిటలాడాయి. విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండాలని అలంకరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. లైట్ సెట్టింగ్‌తోపాటు వివిధ రకాల పూలు, బెలూన్ డెకరేషన్, అరటి, మామిడి తోరణాలతో ప్రతి పందిరి చవితికి స్వాగతం పలుకుతోంది.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డుతో పాటు గిరింపేట, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, మిట్టూరు, మురకంబట్టు, సంతపేట తదితర ప్రాంతాల్లో ఏటా వినాయకచవితిని ఘనంగా నిర్వహిస్తారు. ఈసారి చవితి సంబరాలు ప్రతి వీధుల్లోను కనిపిస్తున్నాయి. మండపాల వద్ద ఏర్పాటు పనుల్లో పిల్లల నుంచి పెద్దల వరకు నిమగ్నమయ్యారు. మంచి ముహూర్తంలో స్వామి వారికి తొలిపూజ చేసేలా సమయం ఖరారు చేసుకున్నారు. దీంతో ఆ సమయానికి తగ్గట్టు ఏర్పాటు పనులను పూర్తి చేసుకోవడం, తొలిపూజకు కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలు చేయడం వంటి పనుల్లో ఎవరికి వారు బిజీబిజీగా ఉన్నారు. మండపాల వద్ద లైట్ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

డీఐ రోడ్డులో ప్రత్యేకం


చిత్తూరు నగరంలోని డీఐరోడ్డులో ఈ సారి ఏడు గణపతులను ప్రతిష్ఠించనున్నారు. ఈ ఏడు విగ్రహాలు భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఒక్కో వాహన సేవలో స్వామి వారు భక్తులను కనువిందు చేసేలా కొలువుదీర్చనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు తొలిపూజ ప్రారంభం కానుంది. ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రత్యేక వాయిద్యాలను కూడా రప్పించారు. రాత్రికి విశేష పూజలు జరగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

జోరందుకున్న కొనుగోళ్లు

వినాయక చవితి పండుగలో భాగంగా నగరంలోని బజారువీధి, చర్చివీధి, కొంగారెడ్డి ప్రాంతాల్లో వినాయకుని ప్రతిమలతో పాటు పూజకు అవసరమైన పూలు, పండ్లు, ఇతర అవసర సామగ్రిని అమ్మకానికి తెచ్చి పెట్టారు. అరటి పిలకలు, మామిడి ఆకులు, చెరుకు గడలు, జిల్లేడు పూలు, రకరకాల కాయలు జోరుగా క్రయ విక్రయాలు జరిగాయి. చిన్న బొమ్మలు ఎక్కువగా అమ్ముడుబోయాయి. భారీ విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది.

నాయనిచెరువు బొమ్మలకు భలే గిరాకీ

చిత్తూరు మండలం నాయనిచెరువు గ్రామంలో వినాయకుని బొమ్మల తయారీ కుటీర పరిశ్రమ. 20 కుటుంబాలు ఈ బొమ్మల తయారీని ఆధారంగా చేసుకుని జీవిస్తున్నాయి. కొందరు ఇళ్లల్లో చిన్నచిన్న బొమ్మలు చేస్తే, మరికొందరు మాత్రం షెడ్లు ఏర్పాటు చేసుకుని భారీ విగ్రహాలు కూడా చేస్తున్నారు. ఇలా ప్రతి ఏటా ఆ గ్రామంలో రూ.కోటి వరకు వ్యాపారం జరుగుతోందని అంచనా. ఈ సారి కూడా బొమ్మలు ఎక్కువగా తమిళనాడుకు అమ్ముడయ్యాయి. చిత్తూరు పరిసర ప్రాంతాల వాసులు వచ్చి గ్రామంలోనే బొమ్మలను కొనుగోలు చేశారు. గత మూడేళ్ల కంటే ఈసారి బొమ్మల వ్యాపారం బాగుందని తయారీదారులు చెబుతున్నారు.


ఐరాల: కొలువుదీరనున్న వినాయకుడు

పూజకు వేళాయెరా!

పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలో వినాయక చవితి పండుగ వాతావరణం నెలకొంది. వినాయకచవితి సందర్భంగా మండల కేంద్రంలో, గ్రామాల్లో ఘనంగా కొలువుతీర్చనున్నారు. మండల కేంద్రంలోని పూజకు కావలసిన సామగ్రిని కొనుగోలు కోసం మండల ప్రజలు తరలివచ్చారు. ప్రత్యేకంగా మట్టితో చేసిన వినాయక విగ్రహాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ వంటి వాటితో చేసిన విగ్రహాలను ఉపయోగించడం కన్నా మట్టితో చేసిన విగ్రహాలకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వాటి ధర 50 రూపాయల నుంచి అందుబాటులో ఉంది. మండల కేంద్రంలో వినాయక చవితి నిర్వహించే నిర్వాహకులు ముందుగానే పోలీసు శాఖతో అనుమతి తీసుకొని అనేక చోట్ల మండపాలు నిర్మిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్మిస్తున్నారు. ఒక రోజు ముందే మండల కేంద్రంలో వినాయక చవితి పండగ వాతావరణం తలపిస్తుంది.

వీధివీధినా గణనాథునికి మండపాలు

ఐరాల: మండలంలోని పలు గ్రామాల్లో నేటి నుంచి నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలోని వియస్ .అగ్రహారం, కాలవగడ్డ, బజారువీధి, బస్‌స్టాండ్, వైఎస్.గేటు, కామినాయనపల్లె, పొలకల, పాటూరు, అగరంపల్లె గ్రామాల్లో మండపాలలో వినాయక విగ్రహాలు పెట్టి నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు 5 నుంచి 15 అడుగుల విగ్రహాలను పీలేరు, గంగాసాగరం, చిత్తూరు నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.5 వేల నుంచి రూ.30 వేల రేటు పలుకుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

పలు గ్రామాల్లో వినాయక చవితి మండపాలకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సూచించారు. కమిటీ ఏర్పడి వారి వివరాలు పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. మండపాల వద్ద శబ్ద కాలుష్యం లేకుండా చూడాలని చెప్పారు. నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతవరణంలో ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని సూచించారు.

నేడు వినాయక చవితికి సర్వం సిద్ధం

యాదమరి: మండంలోని గ్రామాల్లో సోమవారం వినాయక చవితికి గ్రామీణ ప్రజలు సర్వం సిద్ధం చేశారు. గ్రామాలలో వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించిడానికి మండపాలు ఏర్పాటు చేశారు. అందులో స్వామివరి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇప్పటికే అన్ని మండపాలలో స్వామివారి ప్రతిమలను కొలువు తీర్చారు.







చిత్తూరు: కొంగారెడ్డిపల్లిలో పూజా సామగ్రి అమ్మకాలు, విక్రయానికి మట్టి గణపయ్యలు, డీఐ రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ కటౌట్


పూతలపట్టు: విక్రయానికి సిద్ధంగా మట్టిప్రతిమలు


ఐరాల: వీఎస్ అగ్రహారంలో ఏర్పాటు చేసిన మండపం

పర్యావరణ హితం ఎంతో శ్రేష్ఠం

- మట్టి విగ్రహాల పంపిణీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్ : పర్యావరణహితమైన చవితి వేడుకలు ఎంతో శ్రేష్ఠమైనవని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఆదివారం సాయంత్రం నగర మేయర్ అముద, కమిషనర్ అరుణతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధ్యాత్మిక అంశాల్లో ప్రకృతి సహజత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగర ప్రజలు పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని నగర ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మేయర్ అముద ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 500 మట్టి గణపతి విగ్రహాలను నగర ప్రజలకు అందించినట్లు కమిషనర్ అరుణ చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.


మట్టిబొమ్మలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

పక్కాగా ఏర్పాట్లు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయక నిమజ్జనానికి సంబంధించి కట్టమంచి చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను నగర కమిషనర్ అరుణ పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని చెప్పారు. ప్రధానంగా మెరుగైన లైటింగ్ వ్యవస్థ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని బీజేపీ శ్రేణులు సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రధాని పేరిట పూజలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు షణ్ముగం ఆధ్వర్యంలో ప్రజలకు 1000 మొక్కలను పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలోని నిర్వాసితులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు నాయకులు శ్రీనివాసులు, సురేష్, రామభద్ర, గోకుల్ పాల్గొన్నారు.


తులసి మొక్కలు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

గుడిపాల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 73వ జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్‌చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సోమనాథ్ గౌడ్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. 2024లో కూడా ప్రధాని నరేంద్ర మోదీనే మరోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, బ్రహ్మానందరెడ్డి, రవి, శేఖర్, చంద్ర, సురేష్, ఏలుమలై, మస్తాన్, సుభాష్‌గోపి పాల్గొన్నారు.

ప్రతి భక్తునికీ దర్శనం సులభతరం

- బ్రహ్మోత్సవాల్లో లక్ష మంది భక్తులకు వసతుల కల్పన
- ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 21 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. చవితి రోజు నుంచి స్వామివారు 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల్లో పలు వాహనాల్లో ఊరేగనున్నారు. ఆ తర్వాత మరో 11 రోజులపాటు ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్సవాలు ఉంటాయి. ఈ ఉత్సవాల్లో ప్రతి భక్తుడికి స్వామి వారి దర్శనం సులభతరం చేస్తామంటున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్ర : ఎంత మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు?

జ: దేశంలోనే పవిత్ర పుణ్యక్షేత్రంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. రోజూ లక్ష మంది భక్తులు రావచ్చని అంచనా వేశాం. వారికి తగినట్లే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్ర : ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?


కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

జ: భక్తులు రెండు మూడు రోజులు ఉండి స్వామి వారి సేవలు చూసి తరలించాలన్న వారికి రూ.336 గదులు 100 ఉన్నాయి. ఏసీ గదులు 80 ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి బస్సులలో వచ్చే యాత్రికులకు డార్మిటరీలు, కల్యాణ మండపాలు ఉన్నాయి. బస్టాండ్ నుంచి ఆలయ పరిసరాల వరకు 20 వరకు మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం.

ప్ర : దర్శనం ఏ వేళకు ఆరంభమవుతుంది?

జ: బ్రహ్మోత్సవాలలో ఉదయం 4 గంటల నుంచి స్వామి వారి దర్శనం కల్పిస్తాం. చవితి రోజున ఇంకా త్వరగా దర్శనం ప్రారంభించడానికి ప్రయత్నిస్తాం.

ప్ర : వీఐపీలకు ఎలాంటి సమయంలో దర్శనం కల్పిస్తారు?

జ: బ్రహ్మోత్సవాల సమయంలో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర : బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక క్యూలు, వసతులు ఎలా ఉంటాయి?

జ: ఉచిత క్యూలు రూ.100, రూ.150 క్యూలు ఉంటాయి. చంటి పిల్లలకు, గర్భవతులకు, వృద్ధులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశాం. క్యూలలో తాగునీటి కోసం మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశాం. వెలుతురు కోసం విద్యుత్ బల్బులు, ఉక్కపోత ఉంటే ఫ్యాన్లను సైతం ఏర్పాటు చేశాం.

ప్ర : ప్రసాదాలు ఏమేరకు సిద్ధం చేస్తున్నారు?

జ: స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ప్రసాదాలు తీసుకునే అవకాశం ఉంది. భక్తులకు అందించడానికి రూ.15 లడ్డూలు 80 వేలు, రూ.50 లడ్డూలు 10 వేలు, రూ.100 లడ్డూలు 7 వేలు , వడలు 5 వేల వరకు సిద్ధం చేశాము.

ప్ర : ఆలయ పరిసరాల్లో అలంకరణపై మీ అభిప్రాయం?

జ: ఆలయంలో ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ పూర్తయింది. ఆలయం అంతటా ప్రత్యేక పుష్పాలంకరణ చేస్తున్నాం. స్వామివారి బ్రహ్మోత్సవ విశేషాలు తెలిపే విద్యుత్ కటౌట్‌లు ఏర్పాటు చేశాం.

ప్ర : గణేష దీక్ష భక్తులకు ప్రత్యేక సదుపాయాలుంటాయి?

జ: గణేష దీక్ష చేపట్టే భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాం. భక్తులకు కాలక్షేపం కోసం స్వామివారి ఆస్థాన మండపంలో ప్రతి రోజు మధ్యాహ్నం హరికథ గానం, సాయంత్రం భరతనాట్యం, కూచిపూడి, నృత్య ప్రదర్శనలు, రాత్రుల్లో నాటకాలు, నాటికలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర : అన్నదానం వేళలు నిర్ణయించారా?

జ: బ్రహ్మోత్సవాల్లో వచ్చే భక్తులకు అన్నదానంలో రోజు ఎంత మంది వచ్చినా అందిస్తాము. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భోజన వసతి కల్పిస్తాం.

ప్ర: ప్రత్యేక కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?

జ: ఈ ఏడాది నుంచి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు శ్రీకారం చుడుతున్నాం. వేద సభకు ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ఆలయ అర్చకులను, వేదపండితులను సంప్రదిస్తున్నాం.



పెళ్లివేడుకలో మంత్రులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఓ పెళ్లి వేడుకకు ఆదివారం రాత్రి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి హాజరయ్యారు. చిత్తూరు మండలం పచ్చన్నపల్లికి చెందిన పాండియన్ (వరుడు) ఆహ్వానం మేరకు వారు ఈ వేడుకకు విచ్చేసి వధువరూలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎస్ బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.